భగవాన్ మహావీర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో పాల్గొన్న యువతులు

హైదరాబాద్ వార్త

ఉదయం ఎండ..మధ్యాహ్నం వాన

హైదరాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త

వాతావరణంలో మార్పులు వేగంగా జరుగుతున్నాయి. ఎండ, వాన కలగలిసిన వాతావరణంతో నగరంలో రుతువులు అన్నీ ఒకేసారి వచ్చినట్లు మారిపోతోంది. ఉదయం ఎండ, మధ్యాహ్నం వాన, రాత్రికి చలి అన్నట్లుగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నగరంలో పలు చోట్ల వర్షం కురిసింది.గురువారం ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా..మధ్యాహ్నం నగరమంతా చల్లని వాతావరణం ఏర్పడింది. అనంతరం తేలిక పాటి నుంచి మోస్తరు జల్లులుపడ్డాయి. మియాపూర్, మాదాపూర్, కొండాపూర్, చందానగర్, మదీనాగూడ, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, దుండిగల్, గండిమైసమ్మ, బహదూర్‌పల్లి, గగిల్లాపూర్, ఎస్ఆర్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎల్బీ నగర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు పడ్డాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

వర్షాకాలానికి సన్నద్ధం..

-జిహెచ్ఎంసి యాక్షన్ ప్లాన్ రెడీ
-164 మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు
-వాటర్‌లాగిన్ పాయింట్లు, నాలాల్లో పూడికతీతపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, ఏప్రిల్ 10,ప్రభాతవార్త: వర్షాకాలానికి జీహెచ్ఎంసీ ముందుగానే యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తోంది. భారీ వర్షాల నేపథ్యంలో సంభవించనున్న వరదలు, నాలాలు పొంగిపొర్లడం, లోతట్టు ప్రాంతాల మునక, వాటర్ లాగింగ్ పాయింట్లలో తీసుకునే చర్యలపై బల్దియా యాక్షన్ ప్లాన్ రూపొందించే పనిలో నిమగ్నమైంది. రెండేళ్లుగా వర్షాకాలంలో సంభవించే పరిణామాలు, ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు, జీహెచ్ఎంసీ తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసి నివేదిక రూపొందించడానికి కసరత్తు చేస్తున్నారు. 400 టీమ్స్.. గ్రేటర్లో 164 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు, 252 స్టాటిక్ బృందాలు మొత్తం 400లకుపైగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వాతావరణ శాఖ వర్ష సమాచారం అందించిన నేపథ్యంలో వెనువెంటనే ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలు, వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నిలిచిన నీటిని వెంటనే తొలగించేందుకు తీసుకునే చర్యలు, అందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకోవాలని అధికారులు నిర్ణయించారు. అలాగే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షాకాలానికి ముందుగానే ఎక్కడికక్కడ నాలాల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. రూ.55 కోట్లతో 203 పనులు చేయాలని నిర్ణయించారు. 120 పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. రెండు నెలల్లో నాలాల్లో పూడికతీత పనులను పూర్తిచేసే విధంగా ప్రణాళిక రూపొందించారు.

సర్కిల్‌కు ఒక డీఆర్ఎఫ్ టీమ్..

వర్షాకాలంలో సంభవించే వరదలు, రోడ్లపై నీళ్లు నిలవడం వంటి వాటిని పర్యవేక్షించడంతో పాటు పరిష్కరించడానికి హైడ్రా ఆధ్వర్యంలో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డీఆర్ఎఫ్) టీమ్ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో పాటు వర్షాకాలంలో చోటుచేసుకునే పరిణామాలపై జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులతో ప్రత్యేక కమిటీలను వేయాలని నిర్ణయించారు. ఈ కమిటీ సూచన మేరకు వర్షాకాలం యాక్షన్ ప్లాన్ రూపొందించనున్నారు. వర్షాకాలంలో ప్రమాదకరమైన నాలాలను గుర్తించడంతో పాటు వాటిలో పూడికతీసి వాటర్ సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోనున్నారు. నాలాలకు రీటెయినింగ్ వాల్స్ ఏర్పాటు, వరద నీటి కాలువల నిర్మాణం, మ్యాన్ హోల్స్ ఏర్పాటు, వాటి మరమ్మతులు, వాటికి పైకప్పులు ఏర్పాటు చేయడం వంటి పనులు వర్షాకాలానికి ముందుగానే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

పోలింగ్ విధులపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలి

-ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి డా.సునంద రాణి
-పిఓలు, ఏపిఓలు, ఓపిఓలు, మైక్రో అబ్జర్వర్‌లకు శిక్షణ

హైదరాబాద్, ఏప్రిల్ 10,ప్రభాతవార్త: పోలింగ్ విధుల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని ఎన్నికల ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి డా.సునంద రాణి అన్నారు. పోలింగ్ అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం లో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపిఓ లకు తొలి విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ వారికి ఎన్నికల నియమ నిబంధనలు, బ్యాలెట్ బాక్సుల సీల్ విధానం, బ్యాలెట్ పేపర్స్, అవసరమైన ఫారాలు పూరించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డెమో బ్యాలెట్ బాక్స్ ద్వారా వారితో ప్రత్యక్షంగా చేయించి హ్యాండ్స్ ఆన్ శిక్షణను ఇచ్చారు. శిక్షణలో పిఓలు, ఏపిఓలకు తలెత్తిన సందేహాలను మాస్టర్ ట్రైనర్స్ నివృత్తి చేసారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు విజయ, మమత, పిఓలు, ఏపిఓలు, మైక్రో అబ్జర్వర్, ఓపిఓలు తదితరులు పాల్గొన్నారు

డెమో బ్యాలెట్ బాక్సును పరిశీలిస్తున్న సిబ్బంది

విద్యుత్ ఏఇ కార్యాలయాల్లో షాక్ కొడుతున్న అవినీతి..

-అధికారుల లీలలు.. ముడుపులు ఇస్తేనే పనులు

హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: టీజీఎస్పీడిసిఎల్ కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ, భాగ్యనగర్ కాలనీ ఏఇ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి.. కొందరు అధికారులు వసూల్ రాజాలుగా మారి జేబులు నింపుకుంటున్నారు. తమ వద్దకు వచ్చే ఏ పనికైనా అడిగినన్ని ముడుపులు ఇస్తేనే పనులు చేస్తున్నారని. లేకుంటే కార్యాలయాల చుట్టూ నెలల కొద్ది తిరుగాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. కొందరు ఏఇలు అక్రమాలకు పాల్పడుతూ గతంలో పనిచేసి ప్రాంతాలతో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న చోట్ల పెద్ద ఎత్తున అక్రమ వసూళ్ళకు పాల్పడి కోట్ల మేర అక్రమ ఆస్తులు సంపాదించినట్లు గసగుసలు వినిపిస్తున్నాయి. అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దృష్టి సారించకపోవడంతో అక్రమార్కులు మామూళ్ళ కోసం తహ తహ లాడుతూ మరింత రెచ్చిపోయి జేబులు నింపుకోవడంలో బిజీగా ఉంటూ వినియోగదారుల సమస్యలను పట్టించుకోవడంలేదు. కొందరు ఏఇ పోస్టు కోసం లక్షలు ఖర్చుపెట్టి పోస్టులు దక్కించుకున్నారంటే ఈ కార్యాలయాల్లో ఏ మేరకు అక్రమ ఆదాయం వస్తుందో తెలుస్తుంది. కొత్త కనెక్షన్ల మంజూరు మొదలుకుని అపార్ట్మెంట్లలో ట్రాన్స్ ఫార్మర్ల మంజూరుతోపాటు ఏ పనిచేయాలన్నా అందిన కాడికిదండుకుంటూ అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు వేయాలన్నా ప్రతి పనికి ముందుగా అధికారులు ఎస్టిమేన్లు వేయాలి. ఎస్టిమేన్లు వేసేటప్పుడు కొందరు అధికారులు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎస్టిమేన్లు వేసేటప్పుడు మామూళ్ళు ఇస్తే ఒక విధంగా ఇవ్వకుంటే ఇంకో విధంగా ఎస్టిమేషన్లు వేస్తూ సంస్థ ఆదాయానికి గండికొడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏఈ నుంచి టెక్నికల్ ఏఇ వరకు ముడుపులు చెల్లిస్తేనే పనులు అవుతున్నాయి. కొంత మంది అధికారులు గండికొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భవనాలు, అపార్ట్మెంట్లలో 4మీటర్లు దాటితే ప్యానల్ బోర్డు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. ప్యానల్ బోర్డు లేకున్నా మామూళ్ళు తీసుకుని మీటర్లు కేటాయించిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు.చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా కొందరు అధికారులు, సిబ్బంది ప్యానల్ బోరు పేరు చెప్పి విద్యుత్ మీటర్ల జారీలో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచాలి

-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్, ఏప్రిల్ 10,ప్రభాతవార్త: వేసవి సెలవుల్లో అంగన్వాడి బాట ప్రత్యేక కార్యక్రమం చేపట్టి అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా హిమాయత్ నగర్ సెక్టర్ నాంపల్లి ప్రాజెక్ట్ లో గల భీమా మైదాన్ అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవులలో జిల్లాలోని అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో అంగన్వాడి బాట కార్యక్రమాన్ని చేపట్టి కేంద్రాలకు ఎక్కువ మంది పిల్లలు వచ్చే విధంగా ప్రతి టీచర్, ఆయా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతికేంద్రంలో పిల్లల హాజరు శాతం పెంచాలని పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. పిల్లలు ఆటల సమయంలో ఆట పరికరాలతో గడుపే విధంగా చూడాలని ప్లాస్టిక్ టేబుల్స్, చైర్స్‌తో పాటు ఆట వస్తువులు అందించే దిశగా ప్రతిపాదనలు అందించాలని సూచించారు. అంగన్వాడి టీచర్లు ఆయాలకు ఇచ్చే శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చే పిల్లలు యూనిఫాంతో వచ్చేలా చూడాలన్నారు.అలాగే కేంద్రంలోని పిల్లలకు అందించే మిల్క్, బాలామృతం, గుడ్లు, బియ్యాన్ని పరిశీలించారు. ఖాళీ స్థలంలో గార్డెన్ ఏర్పాటుతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ముఖ్యంగా బయటి వారు చెత్తాచెదారం వేయకుండా వెనుక భాగంలో ఉన్న అపార్ట్మెంట్ వారికి కౌన్సిలింగ్ ఇప్పించాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. పిల్లలకు ఆరోగ్య రీత్యా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తప్పక విజిట్ చేయాలని సూచించారు. కేంద్రంలో త్రాగునీటి వాటర్ లైన్ ను ఏర్పాటుకు సత్వరమే చర్యలు చేపట్టాలని నీటి నిల్వకు స్లమ్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా సిడిపిఓ, సూపర్వైజర్లతో కలిసి గర్భిణీలకు సీమంతం కార్యక్రమంలో పాల్గొని సారె కానుకలు అలాగే పిల్లలకు బాలామృతం తినిపించారు.ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ అక్కేశ్వరరావు, తహసిల్దార్ సంధ్యారాణి, సిడిపిఓ కృష్ణ చైతన్య, సూపర్వైజర్ బాల, డిస్టిక్ కో ఆర్డినేటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి

ఓయూ టెక్నాలజీ కళాశాల విద్యార్థి ఆత్మహత్యాయత్నం

-నిబంధనల ప్రకారమే వ్యవహరించామంటున్న కళాశాల యాజమాన్యం

తార్నాక, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : ఒ.యూ టెక్నాలజీ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రణయ్ శశాంక్ (22) సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు గుర్తించి అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు సంభందించి వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాలకు చెందిన ప్రణయ్ చివరి సంవత్సరం మొదటి సెమిస్టర్ లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయ్యారు. దీంతో రివల్యూషన్ కు దరఖాస్తు చేసుకుని పాసయితాననే విశ్వాసంతో సప్లమెంటరీ పరీక్షకు సైతం హాజరు కాలేదు. తీరా రీవాల్యుయేషన్ లో సైతం పాస్ కాలేకపోయాడు. అంతకు ముందుగానే అతడు ఆన్లైన్ లో ఓ కోర్స్ పూర్తి చేశాడు. దానిని పరిగణనలోకి తీసుకొని క్రెడిట్ ట్రాన్స్ఫర్ చేయడం ద్వారా తనను పాస్ చేయాలని కోరారు. దీనికి అధికారులు నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రణయ్ హాస్టల్ కి వెళ్లి సాయంత్రం ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన స్నేహితులు అతన్ని వెంటనే దుర్గాబాయ్ దేశముఖ్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులు గురువారం ఉదయం కళాశాలలో ఆందోళనకు దిగారు. యూనివర్సిటీ అధికారుల వైఖరితోనే ప్రణయ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆరోపించారు. ఇతర యూనివర్సిటీలో క్రెడిట్ ట్రాన్స్ఫర్ చేస్తున్నప్పుడు తమ కళాశాలలో ఎందుకు చేయరని ప్రశ్నించారు. ప్రణయ్ కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమేష్ కుమార్ వివరణ ఇస్తూ నిబంధనల ప్రకారమే తాము వ్యవహరించామని స్పష్టం చేశారు. ఇక్కడి నియమ నిబంధనలకు అనుగుణంగా క్రెడిట్ ట్రాన్స్ఫర్ సాధ్యపడదని చెప్పారు. తాము ఇష్టారీతిన ఏదీ చేయడానికి వీలుండదని, నిబంధనలకు లోబడే పనిచేయాల్సి ఉంటుందని వివరించారు. ప్రణయ్ ఉదంతం పై అధికారులు సమావేశమై చివరి సంవత్సరం విద్యార్థులకు ఐదవ సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షలను మరోసారి నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

అత్తాపూర్‌లో గంజాయి కలకలం

అత్తాపూర్ ఏప్రిల్ 10,ప్రభాతవార్త : విద్యార్థులు, యువతను టార్గెట్ చేసుకొని గంజాయి విగ్రయాలు సాగిస్తున్న కేటుగాడిని అత్తాపూర్ పోలీసులు పట్టుకున్నారు.సిఐ నాగేశ్వర్ రావు వివరాల ప్రకారం....పహాడి షరీఫ్‌కు చెందిన షేక్ జాకిర్ మహారాష్ట్రలోని అమరావతి నుండి గంజాయి తీసుకొని వచ్చి చిన్న చిన్న ప్యాకింగ్ చేసి అత్తాపూర్ పరిధిలోని హసన్ నగర్ ప్రాంతంలో విక్రస్తున్నాడు.పక్కా సమచారంతో అత్తాపూర్ పోలీసులు షేక్ జాకిర్‌ను అదుపులోకి తీసుకొని కేజి గంజాయిన్ని స్వాధీనం చేసుకున్నారు.అయితే విద్యార్థులు,యువతను టార్గెట్ చేసుకొని విక్రయలు సాగిస్తున్నట్లు విచారణలో తెలింది.నిందితుడిపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాజాసింగ్‌పై మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు

గోషామహల్,ఏప్రిల్ 10ప్రభాతవార్త: గోషామహల్ శాసనసభ్యులు టి.రాజాసింగ్ శోభయాత్రలో పోలీసులు ఇచ్చిన షరత్తులను ఉల్లఘించినట్లు మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేశారు.ఈనెల 6వ తేదిన ఆకాష్‌పురి హన్‌మాన్‌మందిరం నుంచి బయలుదేరిన శ్రీరామ శోభయాత్రకు పోలీసులు షరత్తులు విధించారు.అయితే శోభయాత్రలోశాసనసభ్యులు టి.రాజాసింగ్ డి.జె సౌండ్‌ను పెట్టారని,దీనికి తోడు ఆన్‌పార్లమెంటరీ వ్యాఖ్యాలు చేసినట్లు పోలీసులు నిర్ధారించి కేసు నమోదు చేశారు. (139/2025యు/ఎస్ 223,292 బిఎన్ఎస్, 188,290 ఐపిసి డిజె కేసు,శోభయాత్రలో బాల్‌రాంగల్లీ,అన్ పార్లమెంటరీ వ్యాఖ్యాలు చేసినట్లు రాజాసింగ్‌పై క్రైం నెంబర్144/2025 యు,221,351 (2)352 బిఎన్ఎస్,పాతసెక్షన్ 186,506,504 ఐపిసిపై 8వ తేదిన కేసు నమోదు చేసినట్లు మంగళ్‌హాట్‌పోలీసులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్ల స్వాధీనం

నాంపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : హైదరాబాద్ (నాంపల్లి) రైల్వే స్టేషన్‌లో గురువారం ఉదయం 8గంటల సమయంలో జీఆర్‌పి, ఆర్‌పిఎఫ్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 28 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఐఆర్‌పి హైదరాబాద్ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబరు 6లో రైలు నంబరు 17019 హిసార్ ఎక్స్‌ప్రెస్‌లోని ఒక బెడ్‌రోలర్ ఎవరి కోసమో బ్యాగ్‌తో వేచి ఉండడాన్ని గమనించారు. అతడ్ని అడ్డగించి విచారించగా అతడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అమానిగంజ్ చోయ్, జోర్‌మిషర్ కా పురావా, ఇచోల్, అమానిఘుని, ఫైజాబాద్‌కు చెందిన 20ఏళ్ల శివ, రామ్‌సరన్ తండ్రి అని వెల్లడించాడు. నిందితుడు హర్యానా రాష్ట్రం నుండి 750ఎంఎల్ బ్లెండర్ ప్రైడ్ లిక్కర్ బాటిళ్లు 18; 8పిఎం విస్కీ బాటిళ్లు 10 తీసుకువస్తున్నట్లు అంగీకరించాడు. మొత్తం 28 బాటిళ్ల విలువ 32,160 రూపాయలు. నిందితుడి పూర్తి విచారణలో అతడు మద్యం కలిగి ఉండడానికి ఎటువంటి చెల్లుబాటయ్యే అధికారికం/ లైసెన్స్ చూపించలేకపోయాడు. తనిఖీ బృందం అతడ్ని ఆర్‌పిఎస్, హైదరాబాద్‌కి తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నట్లు బి.ప్రవీణ్‌కుమార్ వివరించారు.

పాతనగరంలో హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



దూద్‌బౌలి మహారాజ్‌గంజ్ ఆంజనేయస్వామి దేవాలయంలోని ఆంజనేయ స్వామి

చార్మినార్,ఏప్రిల్ 10 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలోని పలు ప్రాంతాలలో ఈ నెల 12వ తేదీన అత్యంత వైభవంగా శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించటానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.హనుమాన్ జయంతి సంవదర్భంగా మందిరాలను అందంగా తీర్చిదిద్దారు.కాగా శ్రీ హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పాతబస్తీలో శోభా యాత్రలను నిర్వహించనున్నారు.పాతబస్తీ దూద్‌బౌలి మహారాజ్‌గంజ్‌లో పురాతనమైన శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయం ఉంది.దూద్‌బౌలి, మహారాజ్ గంజ్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు శ్రీ ఆంజనేయ స్వామికి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు,అభిషేకాలు నిర్వహిస్తుంటారు.కాగా ఈ నెల 12వ తేదీన జరగనున్న శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా దేవాలయంలో పూజలు,అభిషేకాలు జరగనున్నాయి.మహారాజ్‌గంజ్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించటానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.కాగా మూసాబౌలి హనుమాన్ మందిరం,హైకోర్టులోని చంపా దర్వాజ హనుమాన్ మందిరం,కోకరివాడి బండిఅడ్డలోని శ్రీ హనుమాన్ మందిరం,చార్‌కమాన్ అగర్వాల్ స్కూల్ వద్ద ఉన్న హనుమాన్ మందిరం,చేలాపుర హనుమాన్ మందిరం, శివ గంగానగర్‌లోని శ్రీ హనుమాన్ మందిరం,బహదూర్‌పురలోని స్వయంభు హనుమాన్ దేవాలయంతో పాటు అలియాబాద్, గౌలిపుర,షక్కర్‌కోట,పురానాపూల్,పెట్లాబూర్జు హనుమాన్ మందిరాలలో,షక్కర్‌గంజ్‌లోని శ్రీ దాస ఆంజనేయ స్వామి దేవాలయం, తాడ్‌బన్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి మందిరంతో పాటు పాతనగరంలోని అన్ని శ్రీ హనుమాన్‌దేవాలయాలలో శనివారం అత్యంత వైభవంగా శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు.హైకోర్టులోని చంపా దర్వాజ శ్రీ హనుమాన్ మందిరంలో వేలాది మంది భక్తులు పూజలు నిర్వహించనున్నందున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశారు.శనివారం సాయంత్రం చంపాదర్వాజ హనుమాన్ మందిరం నుంచి శోభా యాత్ర ప్రారంభమై పలు ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం తిరిగి మందిరానికి చేరుకుంటుంది.పలు ప్రాంతాలలో వేదికలను ఏర్పాటు చేసి శోభాయాత్రకు పెద్ద ఎత్తున స్వాగతం పలకనున్నారు.హిందూ ధర్మ ప్రేమీ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ఘాన్సీ బజార్ డివిజన్‌లో శ్రీ హనుమాన్ జయంతి నిశాన్ యాత్రను అత్యంత వైభవంగా .నిర్వహించనున్నారు.కాగా శనివారం జరగనన్న శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలు సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

ప్రాచీనకాలం నుంచి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

-శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి

పౌరాణిక కళాకారుడు బ్రహ్మశ్రీ హనుమంతరాయశర్మను సత్కరిస్తున్న శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: ప్రాచీనకాలం నుంచి సంస్కృతి, సంప్రదాయాలను పరిఢవిల్లే విధంగా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో సత్య సంగీత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల కళాకారుడు బ్రహ్మశ్రీ హనుమంతరాయశర్మ నిర్వహణలో భక్తిరూపక లఘు నాటక ప్రదర్శన అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, ఓంకార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న రుద్రవరం లింగస్వామిమాదిగ

సైఫాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: మూడు దశాబ్దాల ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ పోరాటంలో ఉద్యమకారులపై నమోదైన కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేయాలని మాదిగ దండోర ఉద్యమ కారుల వేదిక (ఎండియువి) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఉద్యమంలో అమరులైన కుటుంబాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, ఉద్యమకారుల పరిస్థితి దుర్భరంగా మారిందని, ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలను, ఉద్యమకారులను అదుకోవాలని కమిటీ రాష్ట్ర ఛైర్మన్ డా.రుద్రవరం లింగస్వామిమాదిగ, అధ్యక్షుడు జిల్లా వెంకటేష్‌మాదిగ, వైస్-ఛైర్మన్‌లు మీసాల కురుమయ్య మాదిగ, నక్క రమేష్ మాదిగ కోరారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమకారులకు, అమర వీరుల కుటుంబాలకు 250 గజాల స్థలం ఇవ్వడంతోపాటు ఇల్లు నిర్మించి కేటాయించాలని, అలాగే సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం అమరవీరుల కుటుంబాలకు ఇళ ్ళ నిర్మించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలులో దండోరా ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో మాదిగ అమరవీరుల స్మృతి వనం నిర్మించాలని వారు కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు, అమరులకు ప్రభుత్వం కల్పించిన ప్రయోజనాలు తెలంగాణ ఉద్యమకారులకు కూడా కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మెట్టుగూడలో బిజేపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న బిజేపీ శ్రేణులు

మెట్టుగూడ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ మెట్టుగూడ డివిజన్ అధ్యక్షులు ఆదర్శ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవ సంబరాల్లో భాగంగా మెట్టుగూడ డివిజన్ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిజేపీ నాయకులు హమలిబస్తీలోని హనుమాన్ దేవాలయాని సందర్శించుకొని ఆంజనేయులు స్వామి ఆశీసులతో బూత్ నంబర్ 30,31,32 లో బిజెపి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దిశా కమిటీ మెంబర్ శారద మల్లేష్,బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కందాడి నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికారప్రతినిధి ప్రభు గుప్తా, సీనియర్ లీడర్స్ సత్తూరి రవీందర్,అంజన్న, రాజేష్ నాయర్,నీలం శ్రీనివాస్ ముదిరాజ్, సరోజ, నాగమల్లేశ్వరీ,బుష్పాక్ శ్రీనివాస్, ముత్తు మంజుల,రమేష్ కుమార్,రమేష్ ముదిరాజ్, గోపి,ఎస్ శ్రీనివాస్ ముదిరాజ్, భానుమతి, శ్రీమతి శేషి కళ, పాల్గొన్నారు.

విఎస్‌టి వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ నియామకం

ప్రసంగిస్తున్న మాజీ ఎంపి, విఎస్‌టి వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జి సంజీవరెడ్డి

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: విఎస్‌టి వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని గురువారం జరిగిన యూనియన్ సర్వసభ సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ, ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి ప్రకటించారు. యూనియన్ సలహాదారులుగా ఐఎన్‌టయుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ డి చంద్రశేఖర్, వి ఎస్ టి మాజీ కార్మిక నాయకులు కే రాజయ్య, చీఫ్ ఉపాధ్యక్షులుగా జి నాగేష్, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ సమాద్, ఏం రణధీర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎల్.డి పాల్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఏఆర్ శ్రీనివాస్ యాదవ్, అసిస్టెంట్ కార్యదర్శులుగా ఎల్ నవీన్ బాబు, ఆర్ విజయేందర్, ప్రచార కార్యదర్శిగా ఏ వెంకట్ రెడ్డి, సహాయ ప్రచార కార్యదర్శిగా పి రామ్మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కే ప్రభాకర్, సహాయ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.సాయి ప్రసాద్ రెడ్డి, కోశాధికారిగా డి కృష్ణారెడ్డి, క్యాంటీన్ సెక్రటరీగా వి వినోద్ కుమార్ లను నియమించినట్లు ఆయన తెలిపారు. వీరి పదవి కాలం రెండు సంవత్సరాల పాటు ఉంటుందని ఆయన తెలిపారు. నూతన కమిటీ నాయకత్వంలో కంపెనీ అభివృద్ధి కార్మికుల సంక్షేమం కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్లేలా కార్యాచరణ

-ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

ప్రసంగిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: వరంగల్‌లో జరిగే బిఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ దిశానిర్దేశం చేశారు. గురువారం ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ముఖ్యనాయకులు, డివిజన్‌లకు చెందిన అధ్యక్షులతో సన్నాహక సమావేశం జరిగింది. అన్ని డివిజన్‌లకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీ అధిష్టానం సూచనలకు అనుగుణంగా సభను విజయవంతం చేయడానికి కృషి చేయాలని అన్నారు. వేలాదిగా నియోజకవర్గ నుండి వరంగల్ సభ విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షులు రాకేష్ కుమార్, కొండా శ్రీధర్ రెడ్డి, వై శ్రీనివాస్, వల్లాల శ్యామ్ యాదవ్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, శంకర్ ముదిరాజ్, మీడియా ఇన్చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, ముఠా నరేష్, సురేందర్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, పోతుల శ్రీకాంత్, ఆకుల అరుణ్, సాయికుమార్, మన్నె దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అన్ని స్థానాలకు పోటీ

క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ దిడ్డి సుధాకర్

సైఫాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందని విజయాల పరంపర సృష్టిస్తుందని పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ భరోసా వ్యక్తం చేశారు. ఈ స్థానికి సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఆప్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీలో సభ్యులు కాకపోయినప్పటికి ఎవరైన సామాన్యులు పారదర్శకత, జవాబుదారితనం ఉన్నవారు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి పోటీ చేయడానికి ఈ కోడ్‌ను ఉపయోగించి దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. రైతులు, మహిళలు, యువతతో సహా సమాజంలోని ప్రతి వర్గానికి మంచి విద్య, ఆరోగ్య సంరక్షణ, జీవనోపాధికి హామీ ఇస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీని విస్తరించే ప్రతిష్టాత్మక ప్రణాళికలో భాగంగా దేశవ్యాప్తంగా స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికలతోపాటు అన్ని ఎన్నికల్లో పోటీ చేయాలని ఆప్ నాయకత్వం నిర్ణయించిందని ఆయన వివరించారు. రాష్ట్రంలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అన్ని జిల్లాల్లో తమ పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని, 'కామన్ మ్యాన్' పార్టీగా రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆప్ తొలిసారిగా అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో ఆప్ నేతలు జావీద్ షరీఫ్, నర్సింగ్ యాదు నాగౌడ్, డా.లక్ష్మనాయుడు, సుధారాణి, షాబాజ్, లియాఖత్‌ఖాన్, లతా, మౌనిక, ధర్మేందర్ తివారి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి లక్ష కిలో మీటర్ల "మాభూమి రథయాత్ర"

-డాక్టర్ విశారాదన్ మహరాజ్

హైదరాబాద్, ఏప్రిల్ 10,ప్రభాతవార్త: తెలంగాణలో బీసీ, ఎస్సీ ,ఎస్టీల రాజ్య సాధనకై ఈ నెల 14 నుంచి 2028 జూలై 11 వరకు లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ,ఎస్సీ,ఎస్టీ రైట్స్ అండ్ రాజ్యాధికార సాధన జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారాదన్ మహరాజ్ తెలిపారు. గురువారం ప్రెస్ క్లబ్లో జరిగిన మీడియా సమావేశంలో కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ..డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజు ఏప్రిల్ 14 మధ్యాహ్నం 2 గంటలకు అదిలాబాద్ డైట్ కాలేజ్ గ్రౌండ్లో ఈయాత్ర ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిస్కారం కోసం గడప గడపకు 10 వేల కిలోమీటర్ల పాదయాత్ర ఉంటుందని అదిలాబాద్‌లో ప్రారంభమయ్యే మాభూమి రథయాత్ర 39 నెలల పాటు రాష్ట్ర మంతా తిరుగుతూ ప్రజాసమస్యలపై ఆరా తీస్తామన్నారు.అనంతరం 2028 జులై 11న హైదరాబాద్‌లో యాత్ర ముగుస్తుందని తెలిపారు. ప్రజలకు రాజ్యాంగపరమైన హక్కుల సాధన లక్ష్యంగా యాత్ర ఉంటుందని అన్ని పార్టీలు ,ప్రజాసంఘాలు ఒక్కటై

పోస్టర్ ఆవిష్కరిస్తున్న విశారధన్ మహరాజ్, రాఘవేందర్, వినోద్‌యాదవ్ తదితరులు

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే పాలన రెడ్డి, రావుల రాజ్యంగా మారిపోయిందని విశారాదన్ అన్నారు. మూడున్నకోట్ల మంది శ్రమ, త్యాగం, బలిదానాలు అన్నీ వృధా అయ్యాయన్నారు. ఆతప్పును సదవరించుకోవాల్సిన బాధ్యత విధ్యావంతులు, మేధావులపై ఉందని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం కో-కన్వీనర్లు తోట్ల రాఘవేందర్ ముదిరాజ్,రాసాల వినోద్ యాదవ్ , రాష్ట్ర కమిటీ సభ్యులు సాయిబాబా పూసల , అబ్దుల్ రెహమాన్ , గడ్డం మనీష్ గౌడ్ , రాజ్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ పై వేధింపులు ఆపి వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

హైదరాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: బర్కత్ పుర ఆర్టీసీ డిపోలో ఆకార ణంగా తొలగించిన డీఎం అటెండర్, స్వీపర్స్ లను వెంటనే విధుల్లోకి తీ సుకోవాలని బాధితులు ఆర్టీసీ ఉన్నతాధికారులను వేడుకున్నారు. గత ఎన్నో ఏండ్లుగా బస్ డిపోలో అటెండర్, స్వీపర్లుగా పనిచేస్తు న్నామనీ, ఇటీవలే కొత్త కాంట్రాక్టర్ గా మల్లారెడ్డి మమ్మల్ని విధులో నుంచి తొలగించినట్లు వారు పేర్కొ న్నారు. గురువారం బర్కత్ పురలో ని తుల్జాభవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితు రాలు అటెండర్ సుమిత్ర, స్వీపర్స్ నాగ మల్లేశ్వరి, రుక్మిణి మాట్లాడారు. గత 6సంవత్సరాలుగా అటెం డర్ గా, 10 సంవత్సరాలపాటు స్వీపర్ గా విధులు నిర్వహిస్తున్న ప్పటికీ ఇప్పటివరకు తనపై ఎలాం టి అభియోగాలు లేవని అన్నారు. డిపో మేనేజర్ మంజులా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మహిళా కావడంతో, ఎస్సీ కుటుంబానికి చెందిన వాళ్ళమని చిన్నచూపు చూస్తుందని వారు వాపోయారు. మాడ్యూటీ మేము చేయడంతో పాటు మాతో, మరుగు దొడ్లు శుభ్రం చేయించడం, డిపో మేనేజర్ మంజుల పిల్లల సంరక్షణ బాధ్యతలు, సొంత పనులు చేయించుకుంటున్నారని వారు ఆరోపించారు. ఈ విషయమై 8నెలల పాటు వినుకు చేంది డిఎంను,

సమస్యను వివరిస్తున్న దృశ్యం

అధికారులను అడగడం, 3నెలలుగా మాకు జీతాలు రాలేవని అడిగినందుకు ఉద్దేశపూర్వకంగా కక్షకట్టి నూతన కాంట్రాక్టర్ మల్లారెడ్డి రావడంతో తమని విధుల నుంచి తొలగించారని అటెండర్, స్వీపర్స్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డీఎం.. అటెండర్ అయినా సుమిత్రను, ప లువురు స్వీపర్సులను విధుల్లోకి తీసుకోనీ, భవిష్యత్తులో తమపై ఎలాంటి వేధింపులు లేకుండా చూడాలని కోరారు. లేని పక్షంలో న్యాయ పోరాటం చేస్తానని ఆమే హెచ్చరించారు. నాకు జరిగిన ఈ అన్యాయం తమ తోటి అటెండర్స్ కు, స్వీపర్స్ కు జరగకూడదనీ, ఆర్టీసీ ఉన్నతాధికారులకు తెలియాలని ఉద్దేశంతో నేను నాబాధను విలేకరుల సమావేశంలో చెబుతు న్నానునని ఆమే వెల్లడించారు.

కరువు బకాయిలు, వేతన సవరణ బకాయిలను వెంటనే చెల్లించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: కరువు బకాయిలను, వేతన సవరణ బకాయిలను వెంటనే చెల్లించాలని అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ సర్వసభ్య ఎపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ సర్వసభ్య వార్షికోత్సవ సమావేశం సంఘం అధ్యక్షుడు నళిని మోహన్ నిర్వహణలో జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పలు డిమాండ్‌లను ఆమోదించారు. సిఎఫ్ఎంఎస్ సైట్ లో పెన్షనర్ లేక సంబంధించిన మొబైల్ నెంబర్ అప్డేట్ చేయవలసిందిగా ఖజానా సంచాలకులను కోరారు. హెల్త్ కార్డులకు ఇన్సూరెన్స్ లింకప్ చేసి సత్వరమే ఆదేశాలు ఇవ్వాలని ఎపి సిఎంను కోరారు. వివిధ రకాలైన పెన్షన్ సమస్య పరిష్కరించుటకు మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా పెన్షన్ డైరెక్టేడ్ వెంటనే ప్రారంభించాలని తీర్మానించింది. సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ వివి.జనార్ధన రావు, ఆర్గనైజేషన్ సెక్రటరీ బి. రవీంద్రనాథ్, సాంస్కృతిక కన్వీనర్ శ్రీ. కె.రామారావు, కోశాధికారి రంగాచార్యులు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ప్రముఖ హృద్రోగ నిపుణులు జి.సూర్యప్రకాశ్ గుండెకు

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను సత్కరిస్తున్న అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ ప్రతినిధులఉ నళినిమోహన్, టియంబి.బుచ్చిరాజు

సంబంధించి అన్నిరకాల జాగ్రత్తలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని అన్నారు. జాతీయ పెన్షనర్ ప్రధాన కార్యదర్శి డి సుధాకర్, ఫైనాన్స్ సెక్రటరీ రాజేంద్ర బాబు గారు, ఖజానా సంచాలకుల వారి తరుపున హాజరైన జేటిఒ పి. రాజు, అపోలో హాస్పిటల్ జనరల్ మేనేజర్ పి. బాలసుబ్రహ్మణ్యం, విజయా డయాగ్నొస్టిక్ జనరల్ మేనేజర్ రాకేష్ కుమార్ హాజరవగా సంఘ ముఖ్య సలహాదారు విశ్రాంత ఐఏఎస్ అధికారి డా. బి.లక్ష్మీకాంతం సంఘం చేస్తున్న కృషిని కొనియాడారు.ఆరోగ్య విభాగం కన్వీనర్ డా.ప్రసాద్ ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన విషయాలను వివరించారు.

జై బాపు జై భీమ్ జై సంవిధాన్

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త

ఏఐసిసి అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా తీసుకున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ కాంగ్రెస్ పార్టీ కోలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు 126 డివిజన్ జగద్గిరిగుట్ట అధ్యక్షులు గణేష్ అధ్వర్యంలో మగ్దూం నగర్ నుండి సీసాల బస్తి వరకు నిర్వహించిన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న భాజపా ప్రభుత్వం దేశ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను ప్రజలందరికీ తెలియచేస్తూ, జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ రచయిత అంబేద్కర్ త్యాగాల ను తెలియచేస్తు ప్రజలను చైతన్యవంతం చేయడం కోసమే ఈ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారం భించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కృష్ణ గౌడ్, రషీద్ భాయ్, వరమ్మ, భరత్ గౌడ్, నరేందర్ రెడ్డి, రవీందర్, శ్రీనివాస్ చారి, స్వాతి, గోరె భాయ్, వేణు గౌడ్, కౌసల్య, కనకయ్య, మంగమ్మ, అనిత రెడ్డి, లలిత, వీణ, సునీత, మురళి, సనా, ఆర్ కె, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

తమకు రక్షణ కల్పించాలని రాష్ట్ర డిజిపికి బాధితుడు విజ్ఞప్తి

సైఫాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూమికి, తమకు రక్షణ కల్పిం చాలని రాష్ట్ర డిజిపికి భూ యాజమాని రిజ్వాన్ షేక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కమ్మగూడలో సర్వే నెంబర్లు 240,241,242లోగల 10.9 ఎకరాల భూమిని ఉప్పల్‌కు చెందిన గుండ్ల రాజమ్మ వద్ద కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ఈ భూమికి 2024లో కోర్టు నుంచి ఫైనల్ డిగ్రీ వచ్చిందని తమ న్యాయవాదులచేత అన్ని సలహాలు తీసుకుని భూమిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. గతంలో కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అమాయకులైన ప్రజల నుంచి డబ్బులు దండుకుని డబుల్ రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని ఆరోపించారు. తాము కూడా ఈ భూమి వివాదం లో ఉందని చెప్పినా వినిపించుకోకుండా బ్రోకర్ల మాటలు నమ్మి పేద ప్రజలు ఇళ్ళ స్థలాల కోసం కొనుగోలు చేసి మోసపో యారని చెప్పారు. ఆ భూమికి సంబంధించిన ఆధారా లు తమ వద్ద ఉన్నాయని, దీంతో తాము కొనుగోలు చేసిన భూమికి సరిహద్దులు వేసేందుకు కూలీలను తీసు కుని బుధవారం వెళ్లడం జరిగిందని, కాగా అక్క డ ఉన్న కొంతమంది తమ కూలీలపై కర్రలు, రాళ్ళతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డా రని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డయిల్ 100కు పలు మార్లు ఫోన్ చేసినా పోలీ సులు స్పందించలేదని ఆరో పించారు. తమకు కోర్టు నుంచి ఫైనల్ డిగ్రీ ఉన్నప్పటికి పోలీసులు రక్షణ కల్పించకపోవడం బాధాకరమని ఈ విషయంలో డిజిపి జోక్యం చేసుకుని రక్షణ కల్పించాలని ఆయన కోరారు

అవధానం తెలుగుజాతి వారసత్వ విద్య : దత్తాత్రేయశర్మ

నాంపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : అవధానం తెలుగుజాతి వారసత్వ విద్య అని, దీన్ని కాపాడుకోవడమే కాకుండా ముఖ్యంగా యువతరానికి ఈ విద్యను అందించడమే కాకుండా చిన్ననాటి నుండే పిల్లల్లో అవధానంపట్ల అవగాహన ఆసక్తిని పెంచాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి, అవధాన విద్యావికాస పరిషత్తు అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయశర్మలు అన్నారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో మూడురోజులపాటు నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో జరగనున్న డా. మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ సంపూర్ణ శతావధానంకు సంబంధించిన బ్రోచర్‌ను రెడ్‌హిల్స్ లోని డా. కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో శతావధాని పట్వర్ధన్, దర్శనమ్ పత్రిక సంపాదకుడు వెంకటరమణ, కె.వి.ఎన్.ఆచార్య తదితరులతో కలిసి గురువారం ఉదయం వారు ఆవిష్కరించి ప్రసంగించారు. తెలుగు విశ్వవిద్యాలయం, ప్రజ-పద్యం, అవధాన విద్యావికాస పరిషత్తు సంయుక్త నిర్వహణలో ఒక తెలుగు పండుగగా వైభవోపేతంగా నిర్వహించనున్న ఈ శతావధానానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ఉండి వందమందికిపైగా కవి పండితులు విచ్చేయనున్నారని తెలిపారు. డా. కె.వి.రమణాచారి గౌరవాధ్యక్షుడుగా, హైకోర్టు న్యాయవాది అనంతకృష్ణ అధ్యక్షుడుగా, ఎం.దత్తాత్రేయశర్మ ప్రధాన కార్యదర్శిగా

సంపూర్ణ శతావధానం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శతావధాని వెంకట పట్వర్ధన్, దత్తాత్రేయశర్మ, వెంకటరమణశర్మ, అనంతకృష్ణ తదితరులు

ఆహ్వానసంఘం ఏర్పాటయినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నారుమంచి వెంకట అనంతకృష్ణ మాట్లాడుతూ ఈ శతావధానం తెలుగుభాషా సాహిత్యాలకు ఒక అపూర్వ కానుకన్నారు. ప్రఖ్యాత పండితుడు పట్టువర్ధన్ గతంలో మూడు శతావధానాలు చేశారని గుర్తుచేశారు. 12న పెరంబూదూరు శ్రీరంగాచార్య అధ్యక్షతన సంపూర్ణ శతావధానం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, విశిష్ట అతిథులుగా తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానంద రావు, ఎమ్మెల్సీ డా. సురభి వాణీదేవి, డా. కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, వి.ముక్తేశ్వరరావు, వనం జ్వాలా నరసింహారావు తదితరులు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సి వర్గీకరణ బిల్లు వెనుక కేంద్రం హస్తం

సమావేశంలో మాట్లాడుతున్న వి.ఎల్.రాజు

సైఫాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: రాజ్యాంగ నిబంధనలు పాటించకుండా ఎస్సీ వర్గీకరణ బిల్లును రాష్ట్ర గవర్నర్ ఆమోదించడం వెనుక కేంద్ర ప్రభుత్వ హస్తం ఉందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వి.ఎల్.రాజు ఆరోపించారు. వర్గీకరణ బిల్లుపై ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తామన్నారు. దళిత కులాల్లో ఉన్న మేజారిటి మాల ఉపకులాలను అణిచివేసి వారి ప్రయోజనాలను దెబ్బతీసి మిగతా ఎస్సీ మాదిగ కులాలకు లబ్ధి చేకూర్చడం కోసం, అంతిమంగా దళిత సమాజాన్ని బానిసత్వం చేసుకోవడం కోసం ఈ వర్గీకరణను తీసుకువచ్చారని ఆయన ఆరోపించారు. గురువారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ అనేది ఓటు బ్యాంకు రాజకీయాల కోసమేనని, వర్గీకరణపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉల్లంఘించిందన్నారు. వర్గీకరణను అడ్డుకోవడంలో మాల ప్రజాప్రతినిధులైన మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విఫలం చెందారని, మాల జాతికి ద్రోహం చేసినవారిగా మిగిలిపోతారని ఆయన విమరి ్శంచారు. తెలంగాణలో మాల జాతికి వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీ, బిజెపిలను బోందపెడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్, మాల మహానాడు నాయకులు సంకు శ్రీనివాసులు, జేఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

భారతదేశాన్ని ప్రపంచపటంలో నిలిపిన ఘనత ప్రధాని మోడీదే

బిజెపి జెండాను ఆవిష్కరణ కార్యక్రమంలలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి బండారు విజయలక్ష్మి

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ 45వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం అడిక్‌మెట్ డివిజన్ రామ్‌నగర్ ఈసఆదివారం గాంధీనగర్ డివిజన్ బూత్ నెంబర్ 230 వద్ద పార్టీ జెండాను పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి బండారు విజయలక్ష్మి ఆవిష్కరించి ప్రసంగించారు. 1980 లో స్థాపించిన బీజేపీ పార్టీ ఆశయాలు,సిద్ధాంతాలకు లోబడి మన భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ పది సంవత్సరాలలో ఆశయాలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తూ ముందుకు వెళ్తున్నారని, ప్రధానంగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అర్టికల్ 370, ట్రిపుల్ తలక్ రద్దు, అయోధ్య రామ మందిర నిర్మాణం, ఇటీవల వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం లాంటి ప్రతిష్టాత్మక నిర్ణయాలతో బీజేపీ పార్టీ ద్వారా భారత దేశాన్ని ప్రపంచదేశాల్లో అగ్రగామిగా నిలబెట్టరాన్నారు. నాయకులు,కార్యకర్తలు తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జి

సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే

5వ వార్డు వాల్మీకి నగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కంటోనె ్మంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్,వైష్ణవి యాదవ్ తదితరులు

కంటోన్మెంట్,ఏప్రిల్ 10 ప్రభాతవార్త: వేసవిలో ప్రజలకు స్వచ్ఛమైన చల్లని తాగునీరు ఉచితంగా అందజేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. మారేడ్‌పల్లికి చెందిన కాంగ్రెస్ మహిళా నాయకురాలు చిర్రబోయిన వైష్ణవి యాదవ్ ఆధ్వర్యంలో గురువారం 5వ వార్డు వాల్మీకి నగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాలు, కులాలకన్న మానవత్వమే గొప్పదనా న్నారు. ఎస్.జి.ఎఫ్ పౌండేషన్ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు తాను చేపట్టడం జరిగిందన్నారు. తమను ఆదర్శంగా తీసుకొని కంటోన్మెంట్ ప్రజలు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగేశ్ యాదవ్, రేపాల వెంకటేశ్వర్లు, రవిందర్,రాజు, రాజు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్‌కు పూర్వ వైభవం తేవాలి : తలసాని

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన కంటోన్మెంట్ నాయకురాలు నివేదిత

కంటోన్మెంట్,ఏప్రిల్ 10 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో కంచుకోటగా ఉన్న ఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కార్యకర్తలు,నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. గురువారం కంటోన్మెంట్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత సాయన్న మారేడ్‌పల్లిలో తలసానిని మర్యాదపూర్వకంగా కలిసి కంటోన్మెంట్ రాజకీయాల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గజ్జెల గోపాల్, రఘురామ్,సంతోష్ రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు : శంకర్ రాజు

మైనర్ పిల్లల తల్లిదండ్రులతో సమావేశమైన ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు,సిఐ మధుబాబు

కంటోన్మెంట్,ఏప్రిల్ 10 ప్రభాతవార్త: మైనర్లు వాహనాలు నడిపితే వారితో పాటు తల్లిదండ్రులపై కూడా కేసు నమోదు చేస్తామని ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు తెలిపారు. గురువారం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులతో కౌన్సిలింగ్‌ను ఏర్పాటు చేసి పలు సూచనలు ఇచ్చారు. మోటార్ వాహనాల చట్ట ప్రకారం, గేర్‌లేని బైక్‌లు 16 యేండ్లు, గేర్ ఉన్న బైక్‌లు కనీసం 18 యేండ్లు ఉన్న వారు వాహనాలు నడపాలని, లేని పక్షంలో మైనర్ చట్టాల కింద చర్యలు తీసుకోవాలి స్నవస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి ట్రాఫి క్ సిపి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి

వివేకానంద్‌నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘం అధ్యక్షులు గొల్ల శ్రీనివాసరావు.

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :
ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌళిక సదుపాయాల కల్పన కోసం శక్తివంచన లేకుండా కృషి చేయటం జరుగుతుందని ఎమ్మెల్యే ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానంద్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గొల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాలనీ వాసులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కృష్ణారావుకు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వీధిదీపాలు, మంచినీటి పైప్‌లైన్‌లు, కమ్యూనిటీ హాల్‌పై అదనపు అంతస్తు తదితర సమస్యలను తీర్చాలంటూ వినతిపత్రం అందించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి ఈ సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ మాజీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రోణంకి జగన్నాథం, తుంగం శ్రీనివాసరావు, చెవూరి మధుసుదన్, సత్యనారాయ పాల్గొన్నారు.

గోవింద మాల దీక్ష

నిజాంపేట్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో బంజారా నాయకులు శ్రీ వెంకటేశ్వర స్వామి హతిరం బాలాజీ, గోవింద మాల దీక్షలో భాగంగా నేడు ఇరుముడి, పూజ, హోమం భోగ్ బండార్ కార్యక్రమానికి కొలను శ్రీనివాస్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ ఎన్,ఎం,సి అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డికి, పార్టీ మహిళా అధ్యక్షురాలు ఇంద్ర, మహిళలకు పార్టీ డివిజన్ నాయకులకి, ఇతర నాయకులకు అందరికీ జై బాపు, జై భీమ్, జై సమీదాన్ కార్యక్రమంలో పాదయాత్రలో పాల్గొని ఉన్న వారందరిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువలతో సత్కరించి ఆహ్వానం పలకడం జరిగింది.

సమస్యలపై బిజెపి నాయకులు పాదయాత్ర

బిజెపి నాయకులు పాదయాత్ర

గన్‌ఫౌండ్రి,ఏప్రిల్ 10ప్రభాతవార్త: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకుగాను బిజెపి అధిష్టానం ఆదేశాల మేరకు జాంబాగ్ డివిజన్‌లో బస్తీ ఛలో అభిమాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈమేరకు జాంబాగ్ డివిజన్ పరిధిలోని కట్టెల మండి నాలాకు అనుకున్న గుడిసె వాసుల సమస్యలను జాంబాగ్ డివిజన్ బిజెపి ఇన్‌చార్జ్ డి.గోపాల్‌జీ,మాజీ గోల్కొండ బిజెపి జిల్లా అధ్యక్షులు వి.పాండుయాదవ్‌లు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రజల నుంచి సమస్యలను సేకరించి ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకుగాను కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు రాజ్‌కుమార్,జగపతి,అమర్‌సింగ్,మయూర్,వి.గోపాల్ పాల్గొన్నారు.

గర్భిణీస్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి మాతృమరణాలను అరికట్టాలి

-ఎన్ఎంలు,ఆశావర్కర్లు నిత్యం గర్భిణీల పరిస్థితి తెలుసుకోవాలి
-జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి

హైదరాబాద్,ఏప్రిల్ 10,ప్రభాతవార్త:
జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి గర్భిణీలకు తగు సూచనలు, సలహాలు, చికిత్స అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్య ఆరోగ్యశాఖ వైద్యులు, సిబ్బందికి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల సేవలు మెరుగుపరచాలని, వారి ఆరోగ్యంపై ఏఎన్ఎం లో ఆశా వర్కర్లు ఫాలోఅప్ చేయాలన్నారు. హై రిస్క్ గర్భిణీ స్త్రీలను గుర్తించి వారి వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో జరిగిన మాతృ మరణాలలో ఆరు మాతృ మరణాలపై సమీక్షించి సరైన సమయంలో చికిత్సలు అందించి ఇకముందు మాతృమరణాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు సకాలంలో వ్యాక్సినేషన్ కూడా నిర్వహించాలన్నారు. ఏఎన్ఎం, ఆశా గృహ సందర్శన చేసి గర్భిణీ స్త్రీల నమోదు సకాలంలో చేసి వారికి వ్యాక్సినేషన్, మాత్రలు, చికిత్సలు అందించాలని ఆదేశించారు. హై రిస్క్ కేసులను సకాలంలో గుర్తించి గర్భిణి కాన్పు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి తదితరులు

సమయంలో ఇబ్బంది కలగకుండా తల్లి బిడ్డ క్షేమంగా ఉండేటట్టు వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే కాన్పు కోసం రిఫరల్ ఆసుపత్రికి పంపాలన్నారు. గర్భవతుల మొబైల్ నెంబర్లు యూపీహెచ్‌సి, ఏఎన్ఎం,ఆశా దగ్గర ఉంచుకొని గృహసందర్శన, ఫోన్ ద్వారా కూడా గర్భవతుల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని తగు సూచనలు, సలహాలు , చికిత్స అందించాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి మాట్లాడుతూ జిల్లాలో యూపీహెచ్‌సి, బీడీకే ద్వారా గర్భవతులకు అందిస్తున్న ప్రసవానికి ముందు, ప్రసవానంతర సేవలు గురించి వివరించారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయమాలిని, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సూచేత,గాంధీ మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యవతి, ఎస్‌పిహెచ్‌ఓలు,మెడికల్ ఆఫీసర్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం

కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్‌కు గాయిత్రినగర్ కాలనీ సమస్యలపై వినతి పత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘం నాయకులు.

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :
గాయిత్రినగర్ కాలనీలో పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయంటూ వాటిని త్వరగా పరిష్కరించాలని కోరుతూ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు ఆధ్వర్యంలో కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. వి.వి.నగర్‌లోని వార్డు కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లారు. గాయిత్రినగర్ కాలనీలోని ఇండోర్ షటిల్ కోర్టు స్టేడియంలో షెటిల్ కోర్టు పైకప్పు పూర్తిగా శిథిలావస్తకు చేరిందని దీంతో వర్షపు నీరు కురుస్తున్నాయని ఫ్లోర్ మ్యాట్ నూతనంగా ఏర్పాటు చేయాటని గాయిత్రినగర్‌లోని 60 ఫీట్ల రోడ్డులో డివైడర్‌కు ఇరువైపుల మొక్కలు నాటి గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలని అదేవిధంగా సున్నం చెరువు పార్కులో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అందుకు ఆమె స్పందించి తమ దృష్టికి వచ్చిన సమస్యలను స్థానక శాసనసభ్యులు మాదవరం కృష్ణారావుతోపాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో బస్తీబాట

కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

అడ్డగుట్ట, ఏప్రిల్ 10 ప్రభాతవార్తః
అడ్డగుట్ట డివిజన్‌లో బస్తీ చలో అభియాన్ ఇన్చార్జ్ వెంకటేష్ గౌడ్, అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో బస్తీ చలో అభియాన్ (బస్తీ బాట) కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సాయి నగర్. వడ్డెర బస్తిలలో పర్యటించి గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రవేశపెట్టినటువంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్ర రూపంలో ఇంటికి అందించారు. తుకారం గేట్ ముత్యాలమ్మ దేవాలయం ప్రాంగణంలో స్వచ్ఛభారత్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నీటితో శుభ్రం చేశారు. అంగన్వాడి స్కూల్. అడ్డగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు తెలుసుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో సీనియర్ నాయకులు కృష్ణ. నర్సింగ్‌రావు. వీరేశం. హంసరాజు. వెంకట్ స్వామి. లక్ష్మణ్. ఉదయ్. శివాజీ. ప్రసాద్. శ్యామల. ప్రేమలత. శాంతాబాయి. కళ్యాణ్. వసంత. సమంత తదితరులు పాల్గొన్నారు

బిజెపి ఆవిర్భావ దినోత్సవం

కంటోన్మెంట్, ఏప్రిల్ 10 ప్రభాతవార్తః
రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు బిజెపి 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థాపన దివస్ అనే అభియాన్ భాగంగా మోండా మార్కెట్లోలోని కోనేరు స్ట్రీట్‌లో ఆక్టివ్ మెంబర్షిప్ చేసిన కార్యకర్తలతో, బస్తీ నాయకులు, కుల సంఘాల నేతలతో కేంద్ర ప్రభుత్వ సుపరిపాలన గురించి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అంబేద్కర్ నగర్ యూత్ ప్రెసిడెంట్ శేఖర్, పాట్ మార్కెట్ జువెలరీ అసోసియేషన్ మెంబర్స్ దయారాం, గంగపుత్ర సంఘం మహిళా అధ్యక్షురాలు సంగీత, ఎస్బిఐ బ్యాంక్ ఉద్యోగి రామచందర్‌లను ఘనంగా సన్మానించారు. టైగర్ నరేంద్ర వర్ధంతి సందర్భంగా వారికి నివాళులర్పించారు.

స్పీకర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

ఆహ్వానపత్రికను అందజేస్తున్న దృశ్యం

సికింద్రాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్తః
సికింద్రాబాద్ పార్సిగుట్టలోణజ శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయ 9వ వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 23వ తేదీన జరిగే వార్షికోస్వవంలో భాగంగా అమ్మవారి కళ్యాణం, చండి హోమం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పవన్ కుమార్ గౌడ్ వివరించారు. కార్యక్రమంలో ధనశేఖర్, సంగం జగదీశ్వర్, శ్రీకాంత్ రెడ్డి, శైలందర్, దేవేందర్, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

-ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దిన్.

స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్.

మెహిదీపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : కార్వాన్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో, త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గురువారం నానల్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న విడిసిసి రోడ్డు పనులతో పాటు పెండింగ్ పనులు, వర్షపు నీరు పోయేందుకు ఏర్పాట్లు తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించి నప్పుడే నాయకులకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఆయన వెంట నానల్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ నసీరుద్దీన్, స్థానిక నేతలు జిహెచ్ఎంసి అధికారులు ఉన్నారు.

ఆర్టీసిలో ఎస్.ఆర్.బి.ఎస్ మూసివేతకు యాజమాన్యం కసరత్తులు

-స్కీమ్‌ను మూసివేసే పరిస్థితే వస్తే మెరుపు సమ్మె

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:
ఆర్టీసిలో స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీం(ఎస్ఆర్‌బిఎస్)ను మూసివేతకు యాజమాన్యం పావులు కదుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇది చాలా అన్యాయమని ఆర్టీసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, కో చైర్మన్ కె.హన్మంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మోలానా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో నేతలు మాట్లాడారు. ఆర్టీసి ఉద్యోగులకు అతి తక్కువ పెన్షన్ ఉన్నందున రిటైరైన ఉద్యోగుల ప్రయోజనాల కోసం స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్ (ఎస్.ఆర్.బి.ఎస్) 01051989 నుండి ఈ స్కీమ్ ను యాజమాన్యం మరియు ట్రేడ్ యూనియన్ల ద్వైపాక్షి క అగ్రిమెంట్ ద్వారా తీసుకు రావటం జరిగిందని ఆర్టీసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, కో చైర్మన్ కె.హన్మంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మోలానా తెలియజేశారు. నాటి నుండి నేటి వరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఈ స్కీమ్ ద్వారా ప్రతి నెల క్యాష్ బెనిఫిట్ అందజేయబడుతోందని, ప్రతి సభ్యుడి నుండి ప్రస్తుతం రూ.250 సభ్యత్వం రికవరీ చేస్తున్నారని, రిటైరైన ఉద్యోగికి రూ.4,020 ప్రతినెలా క్యాష్ బెనిఫిట్ గా చెల్లించబడుతోందన్నారు. ఈ స్కీమ్ లో 11 మందితో కూడిన బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఉంటారని, కాని ప్రస్తుతం యూనియన్లు లేనందున 6 మంది సభ్యులు మాత్రమే నిర్ణయాలు తీసుకోవటం సమంజనం కాదని విమర్శించారు. ఈ స్కీమ్ ను మొదలుపెట్టినప్పుడు ఇంటి రుణాలు, విద్యా రుణాలు, వివాహ రుణాలు కార్మికులకు అందించేవారని, కాని ప్రస్తుతం యాజమాన్యం వీటికి తిలోదకాలిచ్చిందని, ఈ స్కీమ్ ను కొనసాగించాలనే ఉద్దేశంతో బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ లో యూనియన్ల సభ్యులుగా ఉన్నప్పుడు సభ్యత్వ చందా రూ.250 నుంచి రూ.500లకు పెంచి రిటైరైన ఉద్యోగులకు ప్రతి నెల క్యాష్ బెనిఫిట్ పెంచే విధంగా ఒక స్టడీని కూడా చేయించటం జరిగిందన్నారు. సంస్థను ఎలాగైనా కొనసాగించాలనే ఉద్దేశంతో రెగ్యులర్ ఉద్యోగులతో పాటుగా కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా సభ్యత్వ చందా రికవరీ చేయాలని బైలా లో మార్పులు చేయటం జరిగిందన్నారు.

ఈ స్కీమ్ బైలాటరల్. అగ్రిమెంట్ ద్వారా వచ్చినందున స్కీమ్ లో ఎటువంటి మార్పులు చేర్పులు చేయాలన్నా. యూనియన్లతో సంప్రదించాల్సిన అవసరం ఉందని, యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలతో తీసుకోకూడదని వారన్నారు. ఆర్టీసి యాజమాన్యం ఎస్.ఆర్.బి.ఎస్ మూసివేత చర్యలకు పాల్పడితే జెఎసి ఆధ్వర్యంలో జరగబోవు ఆందోళన కార్యక్రమాలకు పూర్తి బాధ్యత యాజమాన్యమే వహించవలసి వస్తుందని హెచ్చరించారు.

గిరిజన సంక్షేమ హాస్టల్ దినసరి కార్మికుల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి

-అసోసియేషన్ తాత్కాలిక అధ్యక్షులు నాగేశ్వరరావు

ముషీరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ హాస్టళ్లు మరియు ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు, కాంటింజెంట్ వర్కర్లకు గత ఆరు నెలలుగా పెండింగ్ ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన హాస్టల్స్ మరియు ఆశ్రమ పాఠశాలల అసోసియేషన్ తాత్కాలిక అధ్యక్షులు బి.నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గురువారం ఇందిరాపార్కు వద్ద ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జీవో నెంబర్ 64ను తక్షణమే రద్దు చేసి, జిల్లా కలెక్టర్ గెజిట్ జీవో ప్రకారమే జీతాలు చెల్లించాలని కోరారు. ఆరు నెలలుగా వేతనాలు లేక అందరం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి, పెండింగ్ వేతనాలు చెల్లించి, న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 22న తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఉన్న డైలీవేజ్ వర్కర్లు మరియు కాంటింజెంట్ వర్కర్లం అందరం సీఎం దర్బార్‌కి వచ్చి, జీతాలు చెల్లించేవరకు నిరసన తెలియచేస్తామని స్పష్టం చేశారు.

హన్‌మాన్ జయంతి శోభయాత్రను విజయవంతం చేయాలి

హన్‌మాన్ జయంతి శోభయాత్రకు గోడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సేనా ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్,ఏప్రిల్ 10ప్రభాతవార్త: తెలంగాణ భజరంగ్‌సేనా ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదిన హన్‌మాన్ శోభ యాత్రను నిర్వహించడం జరుగుతుందని సేనా అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావుగుప్త తెలిపారు. ఈమేరకు ఆయనకార్యాలయంలో సేనా ప్రతినిధులతో కలిసి హన్‌మాన్ జయంతి గోడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ తెలంగాణ భజరంగ్‌సేనా ఆధ్వర్యంలో హన్‌మాన్ వ్యాయం శాల నుంచి శోభయాత్రనునిర్వహించడం జరుగుతుందన్నారు. పెద్ద ఎత్తున్న సేనా ప్రతినిధులు,హన్‌మాన్ భక్తులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సేనా ప్రతినిధులు మనోజ్, రాఘవన్,నరేష్,అశ్విన్,రామేశ్వర్ మిశ్రా,ప్రవీన్ యాదవ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గౌస్ బాషా అనారోగ్యంతో మృతి...

పరామర్శించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:
కూకట్ పల్లీ వాస్తవ్యులు గౌస్ ఖాన్ పాష గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తో గురువారం ఉదయం అకాల మరణం చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వ రరావు గౌస్ ఖాన్ పాష ఇంటికి వెళ్లి వారి మృతి పట్ల సంత పం తెలియజేస్తూ నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

బాక్స్‌డ్రైన్ పనులను పరిశీలిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

అల్వాల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం అల్వాల్‌లో పర్యటించారు. పలు ప్రాంతాలులో చలి వేంద్రాలు ప్రారంభించడంతో పాటుగా వెంకటాపురం ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేస్తున్న బాక్స్ డ్రైన్ పనులను ఎంబిటి మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి పరిశీలించారు. నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటుగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు కొనసాగించాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. అంతకు ముందు ఓల్డ్‌అల్వాల్, వెంకటాపురంలలో చలివేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు దోలి రమేష్, యాదగిరి గౌడ్, సూర్యప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజులలో తెలంగాణలో బిజెపిదే అధికారం

-జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి

బస్తీబాట కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

సికింద్రాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్తః
రానున్న రోజులలో తెలంగాణలో బిజెపిదే అధికారం ఖాయమని సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, బీజేపీ మహాంకాళి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండిలో చేపట్టిన బస్తీబాట కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీతాఫల్ మండి డివిజన్‌లోని పలు బస్తీల్లో ప్రధాన కూడళ్లలో పార్టీ జెండాలు ఎగురవేశారు. అంతకుముందు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...కుటుంబ పాలన అవినీతి అక్రమాలలో కురుక పోయి అధికారం కోల్పోయిన టిఆర్ఎస్, ప్రస్తుతం ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలతోపాటు ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయారని తెలిపారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే చరిస్మాగల నాయకుడు నరేంద్ర మోడీ అని, నరేంద్ర మోడీ సాధించిన విజయాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ఈ కార్యాక్రమంలో హరి, నాగేశ్వర్ రెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

-గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్

చిక్కడపల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: రాష్ట్రంలో గ్రంథాలయాలను పాఠకులకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేక

ప్రభుత్వ స్థలాలను కొని మోసపోవద్దు : రంగానాథ్

హెచ్. ఆర్.సి.ఎస్ ఇండియా వెబ్ సైట్‌ను ప్రారంభిస్తున్న హైడ్రా కమిషనర్ రంగానాథ్.

వనస్థలిపురం. ఏప్రిల్,10.ప్రభాతవార్త.
చెరువులు,నాలాలు, ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవడం కోసమే హైడ్రా ఏర్పాటైందని హైడ్రా కమిషనర్ డాక్టర్.రంగానాథ్ పేర్కొన్నారు. గురువారం ఎల్.బి.నగర్ లో హెచ్.ఆర్.సి.ఎస్ ఇండియా ఉచిత ఆన్ లైన్ వెబ్ సైట్ ను ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అబద్ధపు మాటలు నమ్మి చెరువులు, ఎఫ్.టి.ఎల్ ,బఫర్ జోన్ల పరిధిలో ,ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు, స్థలాలు కొని మోసపోవద్దని ప్రజలకు సూచించారు. చెరువుల్లో ఇల్లుకట్టి వ్యాపారం చేసుకునే వారిపై చర్యలు తప్పవని, కొత్త చట్టం ప్రకారం వారి ఆస్తులు జప్తు చేయబడుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ఎఫ్.టి.ఎల్. సరిగా గుర్తించి కొనుగోలుదారులకు ఉచితంగా సేవలు అందించడానికి హెచ్. ఆర్.సి.ఎస్. డిజిటల్ సేవలను అందించడానికి ముందుకు వచ్చిన సంస్థ సి.ఈ.ఓ . హర్షవర్ధన్ రెడ్డిని రంగానాథ్ అభినందించారు. గత 21 సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ రంగంలో ప్రజలకు సేవాలందిస్తున్నామని హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. రేరా అప్రూవ్డ్ సర్టిఫికెట్ తో కొనుగోలుదారులకు ఉచిత సేవలు ,పేరొందిన 5 బ్యాంకుల ద్వారా వినియోగదారుల కు ఋణాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. బి.ఐ. బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్‌కు విశేష స్పందన

అజంపుర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఇన్ స్పెక్టర్ జనరల్ సైదిరెడ్డి, రిజిస్ట్రేషన్ అధికారి తులసి, సబ్ రిజిస్ట్రార్ సంధ్యారాణి తదితరులు

మలక్ పేట ,ఏప్రిల్ 10, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానానికి అజంపుర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విశేష స్పందన లభించింది. స్లాట్ బుక్ చేసుకున్న ప్రజలు తమకు పేర్కొన్న సమయానికి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి విచ్చేసి దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేయించుకున్నరని అజంపుర సబ్ రిజిష్టర్ సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ల నిమిత్తం విచ్చేసిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. మొదటి రోజు సుమారు 30 మంది రిజిస్ట్రేషన్ ల కోసం స్లాట్ బుకింగ్ చేయించుకోవడం జరిగిందని తెలిపారు.

సెక్షన్ 164 అమలు చేస్తూ ఉత్తర్వులు వెల్లడి

తుర్కయంజాల్ ఏప్రిల్ 10(ప్రభాతవార్త) తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడలో ఇరు వర్గాల ఘర్షణతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నటువంటి కమ్మగూడలోని, తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నెంబర్లు 240 లోని 10.09 ఎకరాల భూమికి సెక్షన్ 164 బిఎన్ఎస్ఎస్ ఉత్తర్వులను ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కె. అనంతరెడ్డి జారీ చేసినట్లు అబ్దుల్లాపూర్ మెట్ తహశీల్దార్ సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. గురువారం కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అబ్దుల్లాపూర్మెట్ మండల్ ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి,ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్లు 240, 241, 242లోని 10.09 ఎకరాల భూమి తమదంటే తమదేనని ఇరు వర్గాలు వరుసగా గొడవలకు దిగుతుండటం, బుధవారం జరిగిన సంఘటనతో లా అండ్ ఆర్డర్ అదుపుతప్పినట్లు గుర్తించామని పేర్కొన్నారు. పాట్లు, భూమి యజమానులతో పాటు, కోర్టు నుంచి ఆర్డర్ పొందిన వారు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి, వనస్థలిపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని మరింత బలోపేతం చేయాలి : కార్పొరేటర్

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: బిజెపిని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. సైదాబాద్ డివిజన్ బిజెపి ముఖ్యనాయకులు, క్రియాశీల సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ కొత్తకాపు అరుణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జిహెచ్ఎంసిలో, తెలంగాణాలో బిజెపి అధికారంలోకి రానుందన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజుల రెడ్డి, బిజెపి నాయకులు సందడి సురేందర్‌రెడ్డి, కెవివి భాస్కర్, మలక్‌పేట బిజెపి కన్వీనర్ గజానంద్‌గౌడ్, సైదాబాద్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు సూరజ్ అప్సింగికర్ తదితరులు పాల్గొన్నారు.

పూలే, అంబేద్కర్ జయంతిలకు ఏర్పాట్లు చేయాలి

సరూర్‌నగర్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:

కమీషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతి పత్రం ఇస్తున్న బహుజన ఐక్య వేదిక నాయకుడు దాసరి బాబు

మహనీయుల జయంతి సందర్భంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మహాత్మా జ్యోతి రావు పూలే, బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను శుభ్రం చేయించి పూలతో అలంకరిం చాలని బహుజన ఐక్య వేదిక కోరింది. ఈ మేరకు గురువారం ఐక్య వేదిక నాయకులు కమీషనర్ జ్ఞానేశ్వ ర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహ నీయుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిం చాలని అన్నారు. సభా కార్యక్రమాలను నిర్వహించడానికి టెం ట్లు, సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయాలని విజ ్ఞప్తి చేశారు. కార్య క్రమంలో దాసరి బాబు, రవీందర్, మల్లికార్జున్, వెంకయ్య పాల్గొన్నారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తా

-ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్ ఏప్రిల్ 10,ప్రభాతవార్త
అభివృద్ధి పనుల్లో రాష్ట్రంలోనే తుర్కయంజాల్ మున్సిపాలిటీ అగ్రగామిగా మీద నిలుపుతామని స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపల్ కేంద్రంలో గల పరిణయ కన్వెన్షన్ హాల్లో గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గురువారం మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అవుతున్నాయని, తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా సీఎం రేవంత్ రెడ్డి తీర్చిదిద్దుతూన్నారన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఇప్పటికీ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. మరిన్ని నిధులతో రానున్న కాలంలో ప్రజలకు కనీస అవసరాలు అయినా రోడ్లు, డ్రైనిజీ, విద్యుత్ దీపాలు, మంచినీటి సరఫరా అందుతున్నాయని, వేసవిలో ప్రజలకు నీటికి ఎటువంటి ఆటంకం కలగకూడదని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా కూడా అంతరాయం రాకూడదని తెలిపారు. సిసి రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఎక్కడ కూడా తేడా జరిగితే సహించేయలేదని కాంట్రాక్టర్లను అధికారులను హెచ్చరించారు. మున్సిపల్ లో అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ పథకాలైన ఇందిరమ్మ ఇల్లు, వృద్ధాప్య పెన్షన్లు, రాజీవ్ ఉద్యోగ వికాసం, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, మహిళల గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల విద్యుత్తు వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి,ఆర్ఐ ఎండి నిజాం,టీపీవో అధికారి దినేష్ టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి కొత్త కుర్మా శివకుమార్,టీపీసీసీ సభ్యులు కాకుమాను సునీల్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్,మాజీ వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్ మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికె ఐలయ్య, కౌన్సిలర్లు వేముల స్వాతి అమరేందర్ రెడ్డి, కంబళ్లపల్లి ధనరాజ్,మెతరి అనురాధ దర్శన్,నరాని కవిత శేఖర్ గౌడ్, మర్రి మాధవి మహేందర్ రెడ్డి,బండారి బాలరాజ్, కొంద్రు మల్లేష్,గుండా భాగ్యమ్మ ధనరాజ్, నాయకులు సామ బీమ్ రెడ్డి, బొక్క వంశీచందర్ రెడ్డి మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సిఎం సహాయనిధి వరం : పరమేశ్వర్‌రెడ్డి

లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్‌లు అందజేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : సిఎం సహాయనిధి నిరుపేదలకు ఒక వరంలాంటిదని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని పలువురు స్థానికులకు సిఎం సహాయనిధి పథకం కింద మంజూరైన చెక్‌లను లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సిఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని, పేదల కోసం కాంగ్రెస్ పార్టీ తమ వంతు కృషి చేస్తుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు సిఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అశోక్‌కు రూ.34వేలు,నగర వెంకటేశ్వర్లుకు రూ.34వేలు, మామిళ్ల లక్ష్మణ్‌కు రూ.60వేలు, అలివేలు పద్మావతికి రూ.60వేలు, మహ్మదబేగంకు రూ.24వేలు, రాంరెడ్డికి రూ.55వేలు, వాణియాదవ్‌కు రూ.6వేలు, పార్థసారథికి రూ.57వేలు, సరితకు రూ.27వేలు, సంపత్‌కు రూ.60వేలు చెక్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, విజయ్‌కుమార్, సాయికిరణ్‌గౌడ్, సీనియర్ నేతలు బజారు జగన్నాథగౌడ్, ఆకిటి ఆగంరెడ్డి, పసల లుకాస్, బి.రఘునాదరెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, కంది శ్రవణ్‌రెడ్డి, నెమలి అనిల్, శ్రీకాంత్‌రెడ్డి, ధర్మేందర్‌నాయక్, రాఘవేంద్ర, పూజారి హనుమంతు, బాకారం అరుణ్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టండి: నందకిశోర్

మీర్‌పేట్ బిజెపి నేతలకు దిశానిర్దేశం చేస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు నందకిశోర్

సరూర్‌నగర్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్ళి ఎండగట్టాలని రంగారెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంఛార్జి నందకిశోర్ భాజపా శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతిచారి, తులసి ముఖేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో జిల్లెలగూడలోని సిద్దాల శ్రీనివాస్ కురుమ రెసిడెన్సీలో పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు చేసిన వారు, పార్టీ సీనియర్ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయడంలో విఫలమైందనీ ఈ విషయాన్ని ప్రజల్లో బిజెపి క్యాడర్ ప్రచారం చేయాలని సూచించారు. ఏ ఎన్నికలైనా ఎప్పుడు వచ్చినా పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు గడచిన పది సంవత్సరాల కాలంలో ప్రధాని నరేంద్ర మోడి సారథ్యంలో వికసిత భారత్ దిశగా దేశం పయనిస్తున్నదనీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, ఉమ్మడి మీర్‌పేట్ కార్పొరేషన్ పార్టీ మాజీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, జిల్లా కౌన్సిల్ మెంబర్లు కోడూరు సోమేశ్వర్, ముత్తంగి కరుణానిధి, జిల్లా మహిళా నాయకురాలు లతాశ్రీ, మాజీ కార్పొరేటర్ కొంద్రు గౌరీ శంకర్, సీనియర్ నాయకులు ఆర్.యాదగిరి యాదవ్, గడ్డం జగన్, ఆవుల సత్తయ్య, బెల్లంకొండ నాగరాజు, ధ్యాసాని తిరుపతి రెడ్డి, విక్కీ శ్రీనివాస్, బచ్చనమోని కాశీరాం యాదవ్, మెకం సుధాకర్ నేత, జగన్ ముదిరాజ్, వలభోజు గోపినాథ్, విక్కీ సాగర్, నాయకులు సిద్దాల శ్రీనివాస్, జిల్లెల ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్, ధరంకార్ కిశోర్, శ్రీను నాయక్, రాఘవేందర్, గోలి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలనలో రోడ్ల సమస్యలకు మోక్షం : రాఘవేందర్‌రెడ్డి

రోడ్ల నిర్మాణంపై హర్షం వ్యక్తం చేస్తున్న అల్మాస్‌గూడ శేషాద్రినగర్‌వాసులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ శేషాద్రినగర్ లో రోడ్ల సమస్యలను పరిష్కరించిన ఘనత కాంగ్రెస్ దేనని మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. కాలనీలో బిటి రోడ్ల నిర్మాణం పట్ల కాలనీ వాసులు రోడ్లను సందర్శించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో శేషాద్రినగర్ కాలనీలో కేవలం కంకర పోసి రోడ్లను వదిలేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బిటి రోడ్లను నిర్మించడం జరిగిందని ఆయన తెలిపారు. తన వినతికి స్పందించి మాజీ మేయర్ చిగిరింత పారి జాత నర్సింహారెడ్డి, కమీషనర్ సరస్వతిలు రోడ్ల నిర్మాణం జరిగేటట్లు చర్యలు తీసుకున్నారని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో దశలవారీగా సమస్యలు పరిష్కారం అవుతున్నాయని రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

బాలాపూర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న కామ్రేడ్లు, మహిళలు

సరూర్‌నగర్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని బాలాపూర్ మండల సిపిఎం నాయకుడు కామ్రేడ్ యాదయ్య డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం బాలాపూర్ చౌరస్తాలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ పెరిగిన వంట గ్యాస్ ధరల వల్ల పేద, సామాన్య ప్రజలకు ఆర్థిక భారం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంట గ్యాస్ ధరలను తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి బాబు, వి.శేఖర్ యాదవ్, ధనంజయ, సత్యం, సురేష్, ఆంజనేయులు, అమ్ములు, లక్ష్మి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

దళిత జనసమితి ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ

లబ్ధిదారులకు సన్న రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్న బొజ్జ యాదగిరి

నాచారం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : నాచారం వీరారెడ్డి కాలనీలో దళిత జన సమితి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన, సన్న బియ్యం కార్యక్రమంలో భాగంగా రేషన్ షాప్ వద్ద సర్వే చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బొజ్జ యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం కార్యక్రమం ప్రతి పేదవారికి తెల్ల రేషన్ కార్డు పొందిన ప్రతి ఒక్కరికి అర్హులుగా గుర్తిస్తూ, పారదర్శకంగా ప్రతి ఒక్క అట్టడుగు పేదవాడికి అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమయంలో రేషన్ షాప్‌ల వద్ద ఎటువంటి అక్రమాలు జరగకుండా, రేషన్ డీలర్లు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండె సంపత్, రాష్ట్ర కార్యదర్శి భావనపల్లి గంగాధర్, బీసీ సంఘ రాష్ట్ర నాయకులు ఎదునూరి సంపత్, గంధ మల్ల క్రిష్టయ్య, పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో ఘనంగా హోమియోపతి దినోత్సవం

ఉప్పల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త : రామంతాపూర్ హోమియోపతి కళాశాలలలో గురువారం ప్రపంచ హోమియోపతి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అయూష్ డైరెక్టర్ కె.హైమావతి, కాళోజి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా.నందకుమార్‌రెడ్డి, మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి, ప్రిన్సిపల్, అడిషనల్ డైరెక్టర్ డా.లింగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రపంచ హోమియోపతి దినోత్సవ వేడుకలు ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. డా.హనిమన్ 270వ జయంతి సందర్భంగా ప్రతి ఏటా ఉత్సవాలు జరుపుకుంటామని తెలిపారు. రోగులకు హోమియో వైద్యం ఎంతో మేలు చేస్తుందని, దీర్ఘకాల రోగాల నివారణకు హోమియోపతి మందులు వాడాలని కోరారు.ఈ సందర్భంగా ఆసుపత్రి భవనం దాత డా.సోహన్ సింగ్ విగ్రహాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా హోమియోపతి పితామహుడు డా.శ్యాముల్ హెనిమన్ జయంతి వేడుకలు నిర్వహించారు. అంతకు ముందు ఆసుపత్రి నుంచి హోమియో వాక్ నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి కళాశాలకు చెందిన పలు విభాగాల సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ పునః నిర్మాణానికి జ్యోష్ణ విరాళం

రామంతాపూర్,ఏప్రిల్ 1 ప్రభాతవార్త : రామంతాపూర్‌లో శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ పునః నిర్మాణానికి మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణ నాగేశ్వర్‌రావు రూ.2.50లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం ఆలయ కమిటి నేతలకు చెక్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం అభివృద్ధికి తమ వంతు చేయూత అందిస్తామని తెలిపారు. ఆలయంలో భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించాలని కోరారు.

తలసేమియా రోగుల కోసం మెగా రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న యువకులు

వనస్థలిపురం. ఏప్రిల్ 10.ప్రభాతవార్త
మహాత్మా జ్యోతి రావు పూలే 198 వ జయంతి సందర్భంగా మదర్ థెరిసా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్ ఆధ్వర్యంలో తలసేమియా రోగుల కోసం బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్ లోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని అడిషనల్ డిప్యూటీ కమిషనర్ అఫ్ పోలీస్ హైదరాబాద్ సి సి ఎస్ గాదరి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....గర్భిణీ స్త్రీలు, కిడ్నీ డయాలసిస్ బాధితులు, తలసేమియా వ్యాధిగ్రస్తులు, ప్రమాదాలకు గురైనవారు, బైపాస్ సర్జరీ రోగులు, కాన్సర్ పేషెంట్స్ సకాలంలో రక్తం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని... కావున ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలనీ కోరారు. రక్తదానం చేసిన యువకులను ఆయన అభినందించి, ప్రశంస పత్రాలు అందజేశారు. మెగా రక్తదాన శిఖరం నిర్వహించిన చేపూరి శంకర్ ను ఆయన అభినందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దగోని సతీష్ గౌడ్, వనస్థలిపురం డివిజన్ తీళీళీ పార్టీ ఉపాధ్యక్షులు లగ్గోని శ్రీధర్ గౌడ్, స్ఫూర్తి సేవ సమితి అధ్యక్షులు కొలిపాక సంజయ్ కుమార్, సిద్ధార్థ కుమార్, కాలనీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి,కార్యదర్శి కృష్ణ, సుధాకర్ శర్మ, కట్ట బాలరాజు, వై. యాదయ్య, కొంగరి నర్సింహా, చేపూరి సునీత, యోగిత, కిరణ్, సందీప్, మేరీ, విజయ్, రెడ్ క్రాస్ నుండి డాక్టర్ జనార్దన్ రెడ్డి, మహేష్, వైద్య పాల్గొన్నారు

జైభీమ్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరించిన ఉప్పల

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త: అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎల్బీనగర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుండి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వరకు జరుగు జైభీమ్ ర్యాలీ పోస్టర్‌ను నాగోల్‌లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, పర్యాటక శాఖ రాష్ట్ర మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆవిష్కరించారు.ఈ సందర్భగా కమిటీ సబ్యులు మాట్లాడుతూ ఉప్పల శ్రీనివాస్‌గుప్త ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీనీ ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భగా ఉప్పల మాట్లాడుతూ ప్రపంచ మేధావి, సామాజిక, రాజకీయ విప్లవకారుడు, మానవ హక్కుల ప్రదాత, మహోన్నత రాజనీతిజ్ఞుడు, భారత రాజ్యాంగ నిర్మాత, భారతదేశ తొలి న్యాయశాఖ మంత్రి, కుల నిర్మూలన సిద్ధాంతకర్త , స్వేచ్ఛ, సమానత్వం, సమ సమాజ స్వాప్నికుడు బాబాసాహెబ్ బీ.ఆర్.అంబేద్కర్ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నక్క మహేష్‌మాదిగ, జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం కొటేష్‌మాదిగ, జేఏసీ రాష్ట్ర నాయకులు మేడి ప్రసాద్‌మాదిగ, జేఏసీ యువజన రాష్ట్ర నాయకులు కొత్తపల్లి అన్వేష్‌మాదిగ, జేఏసీ యువజన రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యశ్పాల్‌గౌడ్

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:
హనుమాన్ శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని హనుమాన్ యువసేన అధ్యక్షుడు బోల్గం యశ్పాల్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి శోభాయాత్ర పోస్టర్‌ను నిర్వాహకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బోల్గం యశ్పాల్ గౌడ్ మాట్లాడుతూ గత 13 సంవత్సరాల నుండి హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 12వ తేదీ